# సింగిల్ పేజీ కథలు

## ఉప్పు-కర్పూరం

కన్నయ్య, రామస్వామి మాచెర్ల వెళ్ళడానికి ఫ్లాట్‌ఫారం దగ్గర బెంచీమీద కూర్చున్నారు. బస్సు అరగంట తర్వాతగాని లేదని ఎంక్వయిరీలో చెప్పారు.

"మీరు ఎక్కడికి వెళ్ళాలి సార్?" అని నడివయసు వ్యక్తి వచ్చి వాళ్ళని అడిగాడు.

"మాచెర్ల వెళ్తున్నాం. ఏం?" అన్నాడు కన్నయ్య.

"నేనూ మాచెర్ల వెళ్ళాలి సార్" అన్నాడు.

"వెళ్ళు. మాకెందుకు చెప్పడం?" అన్నాడు కన్నయ్య.

"ఏం లేదు సార్. మాచెర్ల వెళ్ళడానికి చార్జీకి డబ్బు తక్కువైంది. మీరొక పదిరూపాయలు సహాయం చేస్తారేమోనని సార్. మాచెర్ల వెళ్ళాక ఇస్తాను సార్. మా ఇల్లు రామాటాకీస్ దగ్గరే సార్" అన్నాడు అతడు.

"నీ దగ్గర ఎంతుందేం?" అడిగాడు కన్నయ్య.

"ఏభై రూపాయలు వున్నాయి"

"ఆ ఏభై ఇవ్వు. తక్కువైంది నేనిస్తాను. బస్సు వచ్చాక ఎక్కి మాతోపాటు మాచెర్ల వద్దువుగాని" అన్నాడు కన్నయ్య.

ఆ వ్యక్తి కన్నయ్యవైపు అయోమయంగా చూసి "ఇప్పుడే వస్తా" అని వెళ్ళిపోయాడు.

కన్నయ్య పక పకా నవ్వి "చూశావా బిత్తర గాడు. నన్నే టోకరా కొట్టించాలనుకున్నాడు" అన్నాడు.

"ఐతే ఇటువంటి కేసులు నీకు లోగడ తగిలి వుండాలే. అందుకే వాడి మాయలో పడలేదు" అన్నాడు రామస్వామి.

"ఆ తగిలాయి. నీకు తెలుసుగా నేను కొన్నాళ్ళు మద్రాసులో వుండి సినిమా బిజినెస్ చేశానని. కొత్తలో నాకు అయోమయంగా వుండేది. కొన్నాళ్ళు పాండీ బజార్లో గుడ్‌లక్ లాడ్జీలో వుండేవాడిని. ఎప్పుడో ఇరవై ఏళ్ళ క్రితం మాటలే. మీడియేటర్లు లాడ్జీల చుట్టూ తిరుగుతుండేవాళ్ళు. టి.నగర్లోనే చాలా ప్రివ్యూ థియటర్స్ వుండేవి. ఎక్కడ ప్రివ్యూ వున్నా వచ్చి చూడమనే వాళ్ళు. అలా ప్రతిరోజూ ఏదొక సినిమా ప్రివ్యూ చూసేవాడిని. ఎక్కువగా డబ్బింగ్ సినిమాలుండేవి.

ఒకరోజు నేను పానగల్ పార్కులో ఒంటరిగా కూర్చుని వుంటే సిల్క్ లాల్చీ పైజమా వేసుకుని కిల్లీ నములుతూ వున్న వాడొకడు వచ్చి "గుడీవినింగ్ సార్!" అన్నాడు.

వీడెవడు? ఎక్కడా చూసినట్టు లేదే అనుకుంటూ వుండగా నా పక్కనే కూర్చుని "సార్! నా పేరు గుణశేఖర్ సార్! మీరు గుడ్‌లక్ లాడ్జీలో వున్నారు కదా! బిజినెస్ కోసం వచ్చినారు కదా!" అన్నాడు.

"ఔను. మీరెవరు?" అన్నాడు.

"నేను మీడియేటర్ ఆంజనేయులు అసిస్టెంట్‌ని సార్! బిజినెస్సంతా చూస్తుంటాను. ప్రివ్యూలు వేయిస్తుంటాను. అడ్వాన్సు లిప్పించడం, అగ్రిమెంట్లు రాయించడం అంతా నేనే" అన్నాడు గుణశేఖర్.


"సరే ఏంటి సంగతి?" అన్నాను.

"మీరు గుంటూరుజిల్లాకు కొందామని చూస్తున్నారు గదా?"

"ఔను."

"చెత్త పిక్చరైనా రెండు లక్షలు తక్కువ లేదు సార్! గుంటూరు జిల్లాకు అంత డిమాండ్. కాంపిటీషన్ ఎక్కువ. ఏ పిక్చరైనా గుంటూరు బిజినెస్ ముందే జరిగిపోతుంది"

"నిజమే"



"అందుకే నేనొక ఐడియా చెప్తాను" అంటూ భుజాన వున్న సంచీలో నుంచి ఒక ఆల్బమ్ బైటకు తీశాడు.

ఇంతలో ఒక ముసలాయన, ముసలమ్మ మా దగ్గరకు వచ్చారు.

"అయ్యా! తిరుపతి వెళ్ళాలి. చార్జీలకు లేవు. వంద రూపాయలు ఇవ్వండి. వెళ్ళగానే మని ఆర్డర్ చేస్తాను" అన్నాడు ముసలాయన.

నాకు జాలి వేసింది. చూడటానికి మంచి కుటుంబంలోని వాళ్ళలాగే వున్నారు. మోసగాళ్ళలా కనిపించడం లేదు. నిజంగానే అవసరంలో వున్నారేమో అనిపించింది.

"మా సూట్‌కేసు ఎవరో కొట్టేశారయ్యా!" అన్నది ముసలమ్మ దీనవదనంతో.

గుణశేఖర్ నా చెవిలో వూదాడు. "వీళ్ళు మోసగాళ్ళు సార్! మంచిగా కనిపించిన వాళ్ళకి టోకరా ఇస్తుంటారు. ఇదొక వేషం. డబ్బు ఇవ్వకండి."

"తిరుపతి వెంకన్న మీద ఒట్టు. నిజంగానే మా సూట్‌కేసు పోయింది. అందులో డబ్బుపోయింది" అన్నాడు ముసలాయన కళ్ళనీళ్ళ పర్యంతమైపోయి.

నేను అతని బాధ చూడలేక జేబులోనుంచి వందరూపాయలు తీసి ఆయనకు ఇచ్చాను. నా అడ్రసు కాగితం మీద రాసుకుని వెళ్ళిపోయాడు కృతజ్ఞతలు చెప్పి.

"భలేవాళ్ళుసార్! మీ వంద రూపాయలు గోవిందా!" అన్నాడు గుణశేఖర్.

"ఏమో! నాకు మంచి మనుషుల్లా కనిపిస్తున్నారు" అన్నాను.

గుణశేఖర్ నవ్వి "మీరుట్టి అమాయకులుసార్! అందర్నీ నమ్మేస్తారు. మెడ్రాస్‌లో అంతా ఇటువంటి మాయగాళ్ళే" అన్నాడు.

"కూటికోసం కోటి విద్యలన్నారు. ఇంతకీ సంగతేమిటి?" అన్నాను.

"మీరొక గుంటూరుజిల్లాకి కొంటే ఏం లాభం. మంచి మళయాళం హర్రర్ మూవీ వుంది. చీప్‌లో ఇస్తాడు. వాడికి ఒక పాతిక వేలు అడ్వాన్సు ఇచ్చి డబ్బింగ్ చేసుకోండి. మంచి ప్రాఫిట్" అన్నాడు గుణశేఖర్.

నాకు గుణశేఖర్ ఐడియా నచ్చింది. గుణశేఖర్ ఆల్బమ్ తెరిచి సినిమా స్టిల్స్ చూపించాడు. నాకున్న సినిమా నాలెడ్జితో హర్రర్ సినిమాలకి మినిమమ్ గ్యారంటీ వుంటుందని గ్రహించాను.

"సరే! ప్రివ్యూ వేయించు చూద్దాం" అన్నాను.

"సార్! నాకు కమీషన్ ఇవ్వాలి. టూ పర్సెంట్" అన్నాడు.

"దాందేముంది? ముందు పిక్చర్ నచ్చనీ" అన్నాను.

"సరే సార్! మీరు మూవీ ప్యారడైజ్‌కి వచ్చేయండి. సరిగ్గా ఏడుగంటలకు. ప్రింట్ ఏ.వి.యమ్‌లో వుంది. తీసుకొచ్చేస్తాను" అన్నాడు.

"సరే"

"వెయ్యి రూపాయలు ఇవ్వండి. ప్రివ్యూ థియేటర్‌కి రెంట్" అన్నాడు.

నేను వెయ్యి రూపాయలు గుణశేఖర్‌కి ఇచ్చి గుడ్‌లక్ లాడ్జీకి బయల్దేరాను.

"సార్! మీరు అనవసరంగా ఆ ముసలోడికి వంద ఇచ్చి నష్టపోయారు" అన్నాడు గుణశేఖర్.

నేను నవ్వి వూరుకున్నాను. లాడ్జీకి వెళ్ళి స్నానం చేసి హామీదియా హోటల్లో టీ తాగి మూవీ ప్యారడైజ్‌కి బయల్దేరాను. అక్కడికి దగ్గరే కాబట్టి నడిచి వెళ్ళాను.

నేను వెళ్ళేసరికి ఏదో పిక్చర్ నడుస్తోంది. లోపలకెళ్ళి కూర్చున్నాను. అరగంటకి అది అయిపోయింది. అంతా వెళ్ళిపోయారు. నేను అక్కడే కుర్చీలో కూర్చున్నాను.

"సార్! ఎవరు కావాలి?" అని మేనేజర్ అడిగాడు.

"ఏడుగంటలకి ప్రివ్యూ వుందని గుణశేఖర్ రమ్మన్నాడు" అన్నాను.

"ఎవరూ చెప్పలేదే!" అన్నాడు.

ఏడు దాటింది. గుణశేఖర్ రాలేదు. ఒక అరగంట చూసి

లాడ్జీకి వచ్చేశాను.

ఆంధ్రా కిళ్ళీ షాపు దగ్గర ఆంజనేయులు కనిపించాడు.

“ఆంజనేయులుగారూ! మీ గుణశేఖర్ మళయాళం ఫిల్మ్ ప్రివ్యూ వేయిస్తానని వెయ్యి రూపాయలు తీసుకున్నాడు. మూవీ ప్యారడైజ్‌కి ఏడింటికి రమ్మన్నాడు. టోకరా ఇచ్చాడు” అన్నాను.

“మా గుణశేఖర్ ఎవడండీ బాబూ!” అన్నాడు ఆంజనేయులు బిత్తరపోతూ.

“అదేంటి? మీ అసిస్టెంట్‌నని చెప్పాడే” అన్నాను నిర్ఘాంతపోతూ.

“నాకే పనిలేక ఛస్తుంటే నాకొక అసిస్టెంటా? ఏడ్చినట్టుంది. నిజంగానే వాడు మీకు టోకరా ఇచ్చాడు. ఐనా వాడేదో చెప్పగానే నమ్మెయడమేనా? నేను ఎప్పుడూ ఈ బజార్లోనే చస్తుంటాను గదా! నాకొక మాట చెప్పొచ్చుగా. మద్రాస్‌లో అంతా మాయగాళ్ళనే సంగతి తెలీదా! మీరేం సినిమా బిజినెస్ చేస్తారండీ బాబూ!” అని నాకు క్లాసు పీకాడు ఆంజనేయులు.

నాకు మొఖం వాచిపోయి లాడ్జికెళ్ళి పడుకున్నాను.

కన్నయ్య తనకు టోకరా ఇచ్చిన సంఘటనలు చెప్పాడు రామస్వామితో.

“ఐతే ఒకే రోజు ఇద్దరు నీకు టోకరా ఇచ్చారన్న మాట. భలే అనుభవం” అన్నాడు రామస్వామి.

“ఇంతకీ గమ్మత్తు ఏమిటంటే రెండు రోజుల తర్వాత ఆ ముసలాయన తిరుపతి నుంచి వందరూపాయలు టెలిగ్రామ్ మని ఆర్డర్ పంపించాడు” అన్నాడు కన్నయ్య.

“ఐతే అంతా టోకరా ఇచ్చేబాపతు కాదన్నమాట” అన్నాడు రామస్వామి.

“అదేమరి. టోకరాగాళ్ళ వల్ల నిజంగా అవసరంవుండి అడిగేవాళ్ళని కూడా మోసగాళ్ళేమోనని అనుమానించాల్సి వస్తోంది” అన్నాడు కన్నయ్య.

“నిజమే. అందుకే ఉప్పుకప్పురంబు నొక్కపోలికనుండు అన్నాడు వేమన. తెలుసుకోవడం కష్టమే” అన్నాడు రామస్వామి.

ఇంతలో మాచెర్ల వెళ్ళే బస్సు వచ్చింది. ఇద్దరూ బస్సు ఎక్కారు. డబ్బు తక్కువైనాయని అడిగిన పెద్దమనిషి జాడ లేదు.

-వాణిశ్రీ (హైదరాబాద్)

# ఈ వయసులో...!

దండెమ్మీద వాలిన కాకులు కావు కావుమని రొద చేస్తున్నై. సూర్యోదయమై వుంటుంది. బద్ధకంగా ఒళ్ళు విరుచుకొని గోడ గడియారం వంకా చూశా. ఆరుగంటలు దాటి ముప్పై అయిదు నిమిషాలైంది. బారెడు పొద్దెక్కింది. మంచమ్మీద నుంచి లేవాలనిపించలా. అయినా తప్పదు. ఎనిమిది గంటలకల్లా ఆయన టిఫినుకు తయారౌతారు. రెడీ కాలేదంటే, చొక్కా తొడుక్కుని, మూల తిరుగులో వున్న కాకా హోటలికెళ్తానని గొడవ చేస్తారు. చిన్న పిల్లాడిలా అలగటం, రిటైరైన తర్వాత అబ్బిన పిల్లచేష్ట!

మావారు రిటైరై రెండు సంవత్సరాలైంది. తత్పూర్వం తొమ్మిదిన్నరకే ముక్కునా నోటనా అన్నాన్ని కుక్కుకొని, ఆఫీసంటూ పరిగెత్తే మనిషి, రిటైరైన మర్నాటినుంచి రోజు వారీ కార్యక్రమాన్ని మార్పు చేసుకున్నారు. ఉదయాన్నే అల్పాహారం తప్పనిసరైంది. దినపత్రిక ఆమూలాగ్రంగా చదివి పక్కన పెట్టేటప్పటికి ఉదయం దాటి మధ్యాహ్నం అయ్యేది. అప్పటికిగాని కడుపు నకనకలాడేది కాదు. ఆవురావురుమంటూ భోజనం ముగించుకొని, ముందుగదిలో పక్కపై చేరేవారు. గురక మొదలై సాయంత్రం ఆరుగంటలకిగానీ ఆగేది కాదు. కప్పు కాఫీ తాగి, అలా పొలానికి షికారుగా వెళ్ళేవారు. ఇంతవరకూ వారి దైనందిన కార్యక్రమంవల్ల ఇబ్బంది లేదు. కానీ..ఆ తర్వాత నించే ప్రారంభమయ్యేవి ‘కష్టాలు(?)’ నాకు.


పిల్లలు లేని కొంపలో పన్లు తెమలటం ఎంతోసేపు పట్టదు. యాభైదాటి అయిదువసంతాలైనా, నా ఆరోగ్యానికి ఏ భయం లేదు. అయితే...విశ్రాంతి దినాలు మూడూ హరించుకుపోయినై. ఆయన ‘కార్యక్రమాని’కి గండి పెట్టటం నాకసాధ్యమైంది.

* * *

ఉదయం అల్పాహారం సేవించి, పట్టాకుర్చీలో కూర్చున్న మావారికి, చూరులో దోపిన శుభలేఖ కనబడినట్టుంది.

“ఏయ్ లక్ష్మీ! లక్ష్మీ! ఇలారా. ఈ విషయం తెలుసా! మా తమ్ముడి మనమరాలు పెళ్ళిట!”

కాఫీ గిన్నెలు కడిగిన తడి చేతిని కొంగుకు తుడుస్తూ బయ



టకొచ్చా.

“ఎప్పుడూ?!”

“ఈరోజు సాయంత్రమే! ఆరుగంటలకిట మరి, ప్రయాణానికి సిద్ధంకా”

ఎక్కడో సంబంధం. వెళ్ళాలనే ఉత్సాహం కూడా లేదు. అయినా. ఒకరోజు తప్పినా తప్పినట్టే. నిర్ణయానికొచ్చిందే తడవుగా ప్రయాణానికి సంచీ సర్దటం మొదలెట్టా.

మా గ్రామానికి తెనాలి పది మైళ్ళుంటుంది. రాకపోకలకి బస్సులు తరచుగానే వున్నై. నారింజపండు రంగు చీరె కట్టుకుని, దొడ్లో పూసిన కనకాంబరాలు దండగా కట్టి కొప్పులో సర్దుకున్నా. చేతిలో గుడ్డల సంచీతో ముందుగదిలో కొచ్చా. అప్పటికే ఆయన సిద్ధమై కుర్చీలో కూర్చొనున్నారు.

“అన్ని గదుల తలుపులూ వేశా. మీదే ఆలశ్యం”

ఆయన నా వంక చూశారు. అదే ‘ఆశ’. ఆయన కళ్ళల్లో కనబడింది. నా ఒళ్ళు వణకటం మొదలెట్టింది. ప్రయాణం మానమంటారేమోనని త్వర త్వరగా పక్కింటి సుబ్బాయమ్మ గార్ని ఇల్లు ఓ కంట కనిపెట్టండని చెప్పి, రోడ్డుపైకొచ్చా, తాళం వేసి, మావారూ నాకూడా వచ్చేరు. ఇద్దరం బస్టాపు దగ్గర చెట్టు కింద నిలబడ్డాం. పది నిమిషాల్లో బస్సొచ్చింది. తెనాలి బయల్దేరాం.

* * *

పెళ్ళి పందిరి అందంగా అలంకరించారు. ఈనగారి తమ్ముడు, ఆయన భార్య ఎదురొచ్చి సగౌరవంగా లోపలికి తీసికెళ్ళారు. పట్టుచీరల గరగరలు, చిన్నపిల్లల రణగొణ ధ్వనుల్తో ఇల్లంతా హడావుడిగా వుంది. భోజనాలు సరిగ్గా మధ్యాహ్నం రెండు గంటలకి పూర్తయ్యాయి. గదిలో ఓ పట్టాయేసుకొని, మేనువాల్చాను. ప్రయాణ బడలిక, భుక్తాయాసం కునుక్కి స్వాగతించై.

సాయంత్రం నాలుగు గంటల నుంచే పెండ్లివారిళ్లు హడావుడిగా మారింది. స్నానం ముగించుకొని, చీరమార్చి, వరండాలోకొచ్చా. ఆయన కుర్చీలో నిద్దరోతున్నారు.

“ఏమండీ! మిమ్మల్నే! లేచి స్నానం చేసి గుడ్డలు మార్చుకోండి” కుర్చీ దగ్గరగా నిల్చొని చిన్నగా తట్టి లేపాను. నా వంక ఓ మారు చూశారు. కళ్ళలో ‘అదే యావ’ కొట్టొచ్చినట్టు కనబడింది. దూరంగా జరిగి, చేతికి తుండందించి, కావాలని లోనికెళ్ళా.

స్నానం ముగించి, పెళ్ళికి సిద్ధమైనారు. వివాహ వేదిక దగ్గరగా, ఆడవాళ్ళలో చేరాను.

మంగళ వాయిద్యాల మధ్య, మాంగళ్యధారణ అయిపోయింది. మిగతా తతంగంతో అంతగా పనిలేనివాళ్ళంతా, భోజనాల ఏర్పాట్లు గురించి హడావుడి పడుతున్నారు.

భోజనాలు ఎనిమిది గంటలకి ముగించి, వారికి లుంగీ ఇద్దామని వరండాలో కొచ్చి లుంగీ చేతికందించా.

“ఏంటిది? ఇప్పుడెందుకూ? ఊరికి బయల్దేరదాం..గుడ్డలు సర్దు”

అవాక్కైపోయా. రాత్రి జాగరణ తప్పదనిపించింది. నీరసంగా, సంచీ కోసం లోపలికెళ్ళా.

ఇంటికి చేరి ‘పన్లు’ పూర్తయ్యేటప్పటికి పదకొండైంది. అప్పుడే ఒక నిర్ణయానికొచ్చా... డాక్టరుగారి సలహా తీసుకోవాలి.

* * *

మధ్యాహ్నం భోం చేసి, ఆయన ముందు గదిలోకెళ్ళారు. వారు తిన్న కంచం కడిగి, నా భోజనం కూడా ముగించి, డాక్టరు అడ్రసు కోసం పక్కింటినుంచి తెచ్చిన వారపత్రిక కోసం చూశా. పోపుపెట్టె మీదుండాల్సిన పత్రిక కనబడలా! ఇక్కడా అక్కడా వెతికా. ఊహూ..కనబడలా. ముందు గదిలోకి తొంగి చూశా. నిశ్చేష్టురాలైనా! విలాసంగా పక్కకు ఒత్తిగిలి, శృంగార కథ చదువుతూ, విలాసంగా కాళ్ళాడిస్తున్న ఈయన్ని చూస్తూనే అచేతనురాలనైపోయా!

-డి.మల్లికార్జునరావు